క్లుప్తంగా

అసిస్టెంట్ ఇంజినీర్‌గా కుమార్‌యాదవ్


కుమార్‌యాదవ్

వీణవంక: ఇటీవల ప్రకటించిన టీఎస్‌పీఎస్సీ అసిస్టెంట్ ఇంజినీర్ ఫలితాల్లో వీణవంక మండలం ఘన్ముక్ల గ్రామానికి చెందిన కాయిత కుమార్ యాదవ్ రాష్ట్ర వ్యాప్తంగా 13వ ర్యాంక్ సాధించాడు. అంతే కాకుండా మల్టీ జోనల్ కేటగిరీలో 5వ ర్యాంక్‌తో ఇరిగేషన్ విభాగంలో అసిస్టెంట్ ఇంజినీర్‌గా ఉద్యోగం సాధించాడు. ఈ సందర్భంగా గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.

'కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలతో బురిడీ కొట్టించింది'

హుజూరాబాద్: పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపించాలని బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావుల రాజలింగారెడ్డి కోరారు. శుక్రవారం హుజూరాబాద్‌లో మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మిషన్ భగీరథ పథకంతో ఫ్లోరైడ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిందన్నారు. ఇంటింటికీ నల్లా కనెక్షన్ ఇచ్చి సురక్షిత మంచినీరు అందించిన అపరభగీరథుడు కేసీఆర్ అని, కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలతో ప్రజలను బురిడీ కొట్టించిందన్నారు. ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయించాలంటే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపించాలన్నారు. కాలువల్లో నీళ్లు లేక ఆలస్యంగా వేసిన పంటలకు సాగునీరు అందక ఎండిపోతున్నాయని, గ్రామాల్లో, పట్టణాల్లో తాగునీరు లేక ప్రజలు అరిగోస పడుతున్నారని అన్నారు. రైతులు, ప్రజలు కష్టాలు పడుతుండగా కాంగ్రెస్‌కు ఓటెందుకెయ్యాలి, పదేండ్లలో రెండేసి పంటలు ఎలా పడించుకోగలిగాం, ఇప్పుడు తొలిపంటకే ఎలాంటి కష్టాలు పడుతున్నామో గుర్తు చేసుకోవాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరు, అందుతున్న సంక్షేమ పథకాలను గమనించాలన్నారు. మే 2న హుజూరాబాద్ నియోజకవర్గంలోని జమ్మికుంట పట్టణంలో నిర్వహించే కేసీఆర్ రోడ్ షోను విజయవంతం చేయాలని కోరారు.

రేపు కేటీఆర్ రోడ్ షో

చొప్పదండి: పట్టణంలో 28న నిర్వహించే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రోడ్ షోను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ కోరారు. చొప్పదండిలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్టీఆర్ చౌరస్తాలో జరిగే రోడ్‌షోకు కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరు కావాలన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు గడుస్తున్నా ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. అబద్దాలు చెప్పి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, ప్రజా గొంతుక వినోద్‌కుమార్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలన్నారు. మతం పేరుతో రాజకీయాలు చేయడం తప్పా బండి సంజయ్ ప్రజలకు చేసిందేమీ లేదన్నారు. సమావేశంలో ఎంపీపీ చిలుక రవీందర్, ఏనుగు రవీందర్ రెడ్డి, మినుపాల తిరుపతిరావు, గడ్డం చుక్కరెడ్డి, మాచర్ల వినయ్‌కుమార్, ఆరెల్లి చంద్రశేఖర్‌గౌడ్, లోక రాజశేఖర్‌రెడ్డి, డాక్టర్ అమిత్‌రావు, కొత్తూరి మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

సమూహ కరపత్రం ఆవిష్కరణ

కరీంనగర్ కల్చరల్: లౌకిక విలువలు సాహిత్యం అనే అంశంపై ఈనెల 28న వరంగల్‌లో జరుగుతున్న రాష్ట్రస్థాయి సదస్సుకు ఆలోచనపరులైన బుద్ధిజీవులు హాజరు కావాలని తెలంగాణ రచయితల వేదిక పిలుపునిచ్చింది. ఈ సందర్భంగా సమూహ రాష్ట్రస్థాయి సదస్సుకు సంబంధించిన కరపత్రాలను కవులు, రచయితలు ఆవిష్కరించారు. సమూహ రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సభ్యుడు గాజోజు నాగభూషణం మాట్లాడుతూ.. సమాజంలో శాంతియుత సహజీవనాన్ని ఎత్తిపట్టేందుకు సుస్థిరమైన ప్రశాంతతను నెలకొల్పేందుకు కవులు తమ కలాలను, గళాలను వినిపించాలన్నారు. రచయిత కందుకూరి అంజయ్య మాట్లాడుతూ.. ప్రజల మధ్య ఐక్యతను పెంపొందించి సమాజంలో సౌభాగ్యాన్ని వర్ధింపజేయాలని సమూహ సదస్సు నిర్వహిస్తున్నారన్నారు. కవులు సి.వి.కుమార్, దామరకుంట శంకరయ్య, నడిమెట్ల రామయ్య, విలాసాగర్ రవీందర్, నెరువట్ల చైతన్య, ఎండీ ఖాలిద్, కనకం శ్రీనివాస్, పెనుగొండ బసవేశ్వర్, సదాశ్రీ, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ


వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్సై సురేందర్

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేట ప్రధాన చౌరస్తా వద్ద శుక్రవారం సాయంత్రం ఎస్సై మామిడాల సురేందర్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది వాహనాలు తనిఖీ చేశారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న దృష్ట్యా తనిఖీలు నిర్వహిస్తున్నామని ఎస్సై తెలిపారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలు పాటించాలని సూచించారు. లేదంటే చట్ట ప్రకారంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన


ధ్వజస్తంభానికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

రామడుగు: మండలంలోని దేశరాజ్‌పల్లి గ్రామ పరిధి ఔదర్‌పల్లిలో శుక్రవారం శ్రీ వీరాంజనేయ స్వామి నవగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ, యాగశాల ప్రారంభోత్సవం వేదపండితులు జగన్నాథం విష్ణువర్ధనాచార్యుల ఆధ్వర్యంలో వేదపండితులు వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ప్రత్యేక పూజలు చేశారు. వేడుకల్లో మాజీ సర్పంచ్ కోల రమేశ్, నాయకులు అమిరిశెట్టి సుధాకర్, ఎల్కపల్లి లచ్చయ్య, ఎడమ జగన్మోహన్‌రెడ్డి, తిరుపతి, ఉత్సవ నిర్వహణ కమిటీ సభ్యులు, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

మండలంలోని వెదిర గ్రామ పరిధి గణేశ్‌నగర్‌లోని శ్రీలక్ష్మీగణపతి ఆలయ దశమ వార్షికోత్సవం శుక్రవారం వేదపండితులు విష్ణుభగవత్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా స్థాపితదేవతాపూజ, మూలమంత్రహోమం, శతఘటాభిషేకం, శ్రీలక్ష్మీగణపతి అష్టోత్తర శతనామార్చన, మహాపూర్ణాహుతి, తీర్థప్రసాద వితరణ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీలక్ష్మీగణపతి భక్తమండలి, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో రెట్టింపు ఆదాయం


మాట్లాడుతున్న అశోక్‌రెడ్డి

చిగురుమామిడి: ఆయిల్‌పామ్ సాగుతో రెట్టింపు ఆదాయం పొందవచ్చని, ఆసక్తి ఉన్న రైతులను ప్రోత్సహించాలని రాష్ట్ర ఉద్యాన, పట్టుపరిశ్రమల శాఖ సంచాలకులు కె. అశోక్‌రెడ్డి అన్నారు. చిగురుమామిడి గ్రామ శివారులోని లోహియా ఎడిబుల్ ఆయిల్‌పామ్ నర్సరీ పెంచుతున్న మొక్కలను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... రైతులకు నాణ్యమైన మొక్కలను అందిస్తే భవిష్యత్‌లో దిగుబడి పెరిగే అవకాశం ఉంటుందన్నారు. మొక్కలకు నీటి కొరత లేకుండా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యాన, పట్టుపరిశ్రమలశాఖాధికారి బి. శ్రీనివాస్, చిగురుమామిడి ఉద్యానశాఖ అధికారి బి. మంజువాణి, సిబ్బంది రోహిత్, కంపెనీ కన్సల్‌టెంట్ రంగనాయకులు, మేనేజర్ భరత్, ఫీల్డ్ ఆఫీసర్ దోమల ప్రవీణ్ పలువురు పాల్గొన్నారు.



నూతన తైక్వాండో జిల్లా కార్యవర్గం

తైక్వాండో జిల్లా కార్యవర్గం

చొప్పదండి: తైక్వాండో కరీంనగర్ జిల్లా అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా దొంతుల మనోహర్ ఎన్నికయ్యారు. చొప్పదండిలో శుక్రవారం జిల్లా తైక్వాండో అసోసియేషన్ ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల అబ్జర్వర్‌గా గండె సంతోష్, రిటర్నింగ్ అధికారిగా అడ్వకేట్ రామగిరి శ్రీనివాస్ వ్యవహరించారు. జిల్లాలోని తైక్వాండో క్లబ్‌లు నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవం చేశారు. ప్రధాన కార్యదర్శిగా శ్రీగాద సంతోష్, కోశాధికారిగా రామగిరి శ్రీజ, ఉపాధ్యక్షులుగా పెండ్లి రాజేందర్, నెల్లి నాగమణి, కార్యదర్శులుగా కిరణ్‌కుమార్, రమ్య, సభ్యులుగా అంజలి, కావ్య, వినోద్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా గౌరవ అధ్యక్షుడిగా గుర్రం ఆనంద రెడ్డి, లీగల్ అడ్వైజర్‌గా రామగిరి శ్రీనివాస్ నియామకమయ్యారు. నూతన కార్యవర్గం 2028 వరకు పనిచేస్తుందని తెలిపారు.

కేంద్రంలో మళ్లీ బీజేపీదే అధికారం


బండి సంజయ్ సమక్షంలో బీజేపీ చేరుతున్న ఉప సర్పంచ్ లత, నాయకులు

గన్నేరువరం: కేంద్రంలో మళ్లీ బీజేపీదే అధికారమని, ఎంపీ ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో గెలుపొంది హ్యాట్రిక్ సాధించబోతున్నట్లు పార్టీ మానకొండూర్ నియోజకవర్గ ప్రభారీ మూగ జయశ్రీ , కన్వీనర్ ముత్యాల జగన్‌రెడ్డి అన్నారు. మండలంలోని జంగపల్లి ఉపసర్పంచ్ గీకురు లత, అంజయ్య, రవీందర్, శ్రీనివాస్, సంపత్, రవి, లక్ష్మీనారాయణ, మహేందర్, భాస్కర్, శ్రీనివాస్, శంకర్, చిన్న మహేందర్ పార్టీ మండల అధ్యక్షుడు నగునూరి శంకర్ అధ్యక్షతను కరీంనగర్‌లో ఎంపీ బండి సంజయ్ సమక్షంలో బీజేపీలో చేరారు. ప్రధాని మోదీ పేదల సంక్షేమ కోసం అమలు చేస్తున్న పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారని, కరీంనగర్ ఎంపీగా మరోసారి బండి సంజయ్‌ను గెలిపించి మరింత అభివృద్ధిని సాధించుకుందామని అన్నారు. కార్యక్రమంలో నాయకులు కోతి ఆంజనేయులు, గుంటుక శంకర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

బండి విజయానికి కష్టపడి పనిచేయాలి


రామడుగు: బీజేపీ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్ విజయానికి ప్రతి కార్యకర్త కష్టపడి పని చేయాలని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మేకల ప్రభాకర్‌యాదవ్ కోరారు. రామడుగులో శుక్రవారం మండల స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశం మండల అధ్యక్షుడు ఒంటెల కరుణాకర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో మండలంలో ప్రచార కార్యక్రమాలపై విస్తృతంగా చర్చించారు. సమావేశంలో బీజేపీ నాయకులు రాజేశ్, పొన్నం శ్రీనివాస్‌గౌడ్, ఉప్పు శ్రీనివాస్, బండ తిరుపతిరెడ్డి, ఎంపీటీసీ మోడీ రవీందర్ పలువురు పాల్గొన్నారు.

దొంగలించిన బైకులు స్వాధీనం



తిమ్మాపూర్: కరీంనగర్‌లోని వివిధ ప్రాంతాల్లో కొన్ని రోజులుగా బైకులు చోరీకి గురవుతున్నాయని ఫిర్యాదులు రావడంతో కరీంనగర్ 1 టౌన్ పోలీసులు నిఘాపెట్టి పక్కా సమాచారంతో శుక్రవారం 20 బైకులను స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని రేణికుంట గ్రామానికి చెందిన బోయిని చంద్రబాబు, గోనెల శంకర్ జల్సాలకు అలవాటు పడి ఈజీ మనీ కోసం కరీంననగర్‌తో పాటు వివిధ ప్రాంతాల్లో పార్కింగ్ చేసిన బైక్‌లను దొంగిలించారు. టాస్క్‌ఫోర్స్ పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టి నిందితుల ఇళ్లకు వెళ్లి విచారించారు. బైక్‌లు దొంగలించినట్లు ఒప్పుకున్నారు. వారి నుంచి బైకులను స్వాధీనం చేసుకుని తిమ్మాపూర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

ఆర్థికసాయం అందజేత


నగదు అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేట గ్రామానికి చెందిన ఏగోలపు మల్లేశం,భారతమ్మ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వైద్య ఖర్చుల కోసం గ్రామానికి చెందిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు శుక్రవారం రూ.12,500 అందజేశారు. బాధితులను ఆదుకోవడానికి దాతలు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో సేవా సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు దాసరి కనకయ్య, దాసరి రవిశాస్త్రి, గౌరవ అధ్యక్షుడు ఒద్దుల హన్మంతరెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

భూ కబ్జా, అక్రమ లేఅవుట్లపై సీఎంకు ఫిర్యాదు

జమ్మికుంట: హుజూరాబాద్, జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ భూములు కబ్జా చేసి అక్రమ లేఅవుట్లు, రిజిస్ట్రేషన్లతో ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న వారిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డికి జమ్మికుంట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు తుమ్మేటి సమ్మిరెడ్డి ఫిర్యాదు చేశారు. హుజూరాబాద్ మండలంలోని గ్రామాల్లో, జమ్మికుంట మున్సిపల్ పరిధి ధర్మారం, రామన్నపల్లి, ఆబాది జమ్మికుంట, హుజూరాబాద్ రోడ్డు, కోరపల్లిరోడ్డులో ప్రభుత్వ భూములు, చెరువు శిఖం భూములు కబ్జాలు చేసి రియల్ ఎస్టేట్ వ్యాపారులు లే అవుట్లు అమ్మకాలు సాగిస్తున్నరని ఆరోపించారు. వారికి పోలీసులు, అధికారులు సహకరిస్తున్నరని వారిపై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అక్రమ లేవుట్లకు దొంగ రిజిస్ట్రేషన్లు చేసిన హుజూరాబాద్ సబ్ రిజిస్ట్రార్‌పై సమగ్ర విచారణ జరిపి శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని సమ్మిరెడ్డి ఫిర్యాదులో పేర్కొన్నారు.

జేఈఈ ఫలితాల్లో జంగపల్లి విద్యార్థికి 601వ ర్యాంక్


రాపోలు శ్రీవాణి

గన్నేరువరం: మండలంలోని జంగపల్లి గ్రామానికి చెందిన రాపోలు సువర్ణ,బాలయ్య కూతురు శ్రీవాణి గురువారం విడుదలైన జేఈఈ ఫలితాల్లో 601వ ర్యాంకు సాధించింది. ఒకటి నుంచి ఐదు, ఆరు నుంచి పది వరకు జంగపల్లి ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో చదివింది. అలాగే ఇంటర్మీడియట్ శ్రీచైతన్య జూనియర్ కళాశాల కరీంనగరలో చదివింది. జేఈఈలో ఉత్తమ కనబరచడంపట్ల ప్రధానోపాధ్యాయులు శారద, ఉపాధ్యాయులు, గ్రామస్తులు శుక్రవారం హర్షం వ్యక్తం చేశారు.

బీఎస్పీని గెలిపించాలి


మాట్లాడుతున్న మొగిలయ్య

జమ్మికుంట: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు బీఎస్పీకి ఓటేసి బహుజన స్థాపనకు కదిలిరావాలని బీఎస్పీ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి మారపల్లి మొగిలయ్య పిలుపునిచ్చారు. జమ్మికుంట పట్టణంలో శుక్రవారం విలేకర్లతో మాట్లాడారు. దేశ ప్రజల అభివృద్ధిపై దృష్టి సారించకుండా ప్రజలను విభజించే దిశగా పార్టీలు, ప్రభుత్వాలు అడుగులు వేస్తున్నాయని, మేధావులు, యువకులు గమనించాలన్నారు. ప్రజలు, ప్రజాస్వామిక వాదులు బీఎస్పీకి ఓటు వేయాలని కోరారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీఎస్పీ విజయకేతనం ఎగురవేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

పుస్తెమెట్టెలు అందజేత



శంకరపట్నం: మండలంలోని రాజాపూర్ గ్రామానికి చెందిన కుర్ర శంకరయ్యవనజ కుమార్తె స్వాతి వివాహం శుక్రవారం జరిగింది. కరీంనగర్ డెయిరీ ఆధ్వర్యంలో పుస్తెమెట్టెలు అందజేశారు. ఈకార్యక్రమంలో సూపర్‌వైజర్ వెంకటేశ్, కుర్ర వెంకటమల్లు, శ్రీనివాస్, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

30న డీఈవో కార్యాలయం ఎదుట ధర్నా

సప్తగిరికాలనీ(కరీంనగర్): వీణవంక జిల్లాపరిషత్ పాఠశాలలో పీడీగా పని చేస్తున్న పోతన శ్రీనివాస్‌ను తిరిగి పూర్వ పాఠశాలలో పునర్నియామకం చేయకుంటే ఈనెల 30న డీఈవో కార్యాలయం ముందు ధర్నా చేయనున్నట్లు శుక్రవారం తెలంగాణ ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సూపరింటెండెంట్‌కు వినతి పత్రాన్నిచ్చింది. ఎస్సెస్సీ పరీక్షలు, ఎస్సెస్సీ మూల్యాంకనం సందర్భంగా పలు కారణాలతో ముగ్గురు ఉపాధ్యాయులను డీఈవో సస్పెండ్ చేయగా.. ఇద్దరు ఉపాధ్యాయులను తిరిగి వారు చేస్తున్న పాఠశాలకే నియామకం చేశారన్నారు. కానీ శ్రీనివాస్ పీడీగా నగునూర్ జిల్లాపరిషత్ పాఠశాలలో పని చేస్తుండగా.. అదే పాఠశాలకు కాకుండా వీణవంక జెడ్పీహెచ్‌కు బదిలీ చేశారని తెలిపారు. అగ్ర వర్ణాలైన ఇద్దరికి అదే పాఠశాలలో నియామకం, దళిత వర్గానికి చెందిన శ్రీనివాస్‌కు వేరేచోటుకు బదిలీ అన్యాయమని వాపోయారు. సంఘం నేతలు మల్లిక్, కిషన్‌నాయక్, రాజన్న ఉన్నారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

గంగాధర: పౌష్టికాహారంతో తల్లి, పిల్లలతో పాటు గర్భిణులు ఆరోగ్యంగా ఉంటారని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రేణుక అన్నారు. మండలంలోని ఉప్పరమల్యాల గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. పిల్లలు వయసుకు తగిన బరువు ఉండటానికి ఎక్కువసార్లు తినిపించాలని, అంగన్‌వాడీ కేంద్రాల్లో అందజేసే బాలామృతం ఎంతో ముఖ్యమని సూచించారు. ఆకుకూరల ప్రాధాన్యతను వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాల సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కార్యదర్శి లీలాదేవి, అంగన్‌వాడీ టీచర్ రాజేశ్వరి, ఆశ వర్కర్ ఎల్లమ్మ,ఆయా వజ్రాదేవి తదితరులు పాల్గొన్నారు.

గన్నేరువరం: మండలంలోని మైలారం, హన్మాజీపల్లె అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం వార్షికోత్సవం నిర్వహించి పిల్లలు ఎదుగుదలపై సమీక్షా చేపట్టారు. పిల్లల ఆటాపాటల అనంతరం వారి బరువు, ఎత్తు వివరాలను తల్లిదండ్రులకు వివరించారు. పలు సూచనలు, సలహాలతోపాటు పిల్లలు ఆరోగ్యంగా ఎదడానికి పౌష్టికాహారం ఎంతో ముఖ్యమని ఐసీడీఎస్ సూపర్‌వైజ్ ఇశ్రత్ సుల్తానా తెలిపారు. అంగన్‌వాడీలో పిల్లలకు మెను ప్రకారం ఆహారం అందించాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, పద్మ, శారద, ఆయాలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

మతరాజకీయాలతో ప్రజల మధ్య చిచ్చు

- బండి సంజయ్‌ది పూటకో మాట రోజుకో వేషం
- బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్‌కుమార్


మాట్లాడుతున్న బోయినపల్లి వినోద్‌కుమార్

గన్నేరువరం: మత రాజకీయాలు చేస్తూ బీజేపీ ఎంపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్ ప్రజల మధ్య చిచ్చు పెడుతున్నారని, పూటకోమాట రోజుకో వేషం వేస్తున్నాడని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ మండిపడ్డారు. గన్నేరువరంలో నిర్వహించిన రోడ్ షోలో మాట్లాడారు. ఐదేళ్లలో ఎంపీగా బండి సంజయ్‌కుమార్ ప్రజలకు ఒరగబెట్టిందుమి లేదన్నారు. అసమర్థతతోనే ట్రిపుల్ ఐటీని కేంద్రలోని బీజేపీ ప్రభుత్వం ఇతర రాష్ట్రాలకు తరలించిందన్నారు. ఏటా కేంద్రం నుంచి వచ్చే నిధులనే బండి తెచ్చినట్లుగా చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. కొత్తపల్లి-మనోహరాబాద్ రైల్వే లైన్, కరీంనగర్ స్మార్ట్ సిటీ కోసం రూ.వెయ్యి కోట్లతో తీసుకువచ్చానన్నారు. బండి సంజయ్‌కు సోయి ఉంటే వేములవాడ, కొండగట్టు ఆలయాలకు నిధులు తీసుకురావాలని సూచించారు. చేసిన అభివృద్ధి లేక దేవుడి పేరుతో రాజకీయాలు చేస్తున్నాడని, కాంగ్రెస్, బీజేపీ ఒక్కటైయ్యాయని వాటిని తిప్పికొట్టాలన్నారు. అబద్దాల మీద కాంగ్రెస్ ప్రభుత్వం గద్దెనెక్కిందన్నారు. గుండ్లపల్లి నుంచి పొత్తూరు వరకూ స్థానిక ఎమ్మెల్యే ఎందుకు పనులు సాగనివ్వడం లేదన్నారు. మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పాలనలోని అభివృద్ధిని వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక కరువు తాండవిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, జెడ్పీ మాజీ చైర్మన్ తుల ఉమ, జడ్పీటీసీ రవీందర్ రెడ్డి, మండల అధ్యక్షులు గంప వెంకన్న, ఎంపీపీ స్వప్న, గూడెల్లి ఆంజనేయులు, రెడ్డవేని తిరుపతి, గడ్డం నాగరాజు పాల్గొన్నారు.

'మంత్రి పొన్నం ప్రభాకర్‌కు గుణపాఠం చెప్తాం'

చిగురుమామిడి: సీపీఐతో కాంగ్రెస్ పొత్తుపెట్టుకొని హుస్నాబాద్ నియోజకవర్గంలో ఏ ఒక్క సీపీఐ నాయకుడితో మాట్లాడిన సందర్భాలు లేవని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అందె స్వామి అన్నారు. మండలంలోని లంబాడిపల్లి గ్రామంలో శుక్రవారం విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సీపీఐ ఓట్లతో గెలిచి అవసరం తీరాక పార్టీ కార్యకర్తలను, నాయకులను పట్టించుకోకపోవడం సిగ్గుచేటని, ఆయన వ్యవహారశైలి విస్మయం కల్గిస్తోందని విమర్శించారు. ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో సీపీఐ పొత్తుతో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు పోటీ చేస్తున్నాడని ఓటర్లకు చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రాష్ట్ర, జిల్లా నేతలతో మాట్లాడామని చెప్పి తీరా హుస్నాబాద్ నియోజకవర్గంలోని ఏడు మండలాల కార్యకర్తలను సంప్రదించకపోవడం ఏంటని మంత్రిని ప్రశ్నించారు. అభివృద్ధి, సమస్యల పరిష్కారంలో పార్టీ కార్యకర్తలను పట్టించుకోవడంలేదన్నారు. కమ్యూనిస్టుల ఓట్లతో గెలిచి మంత్రిగా బాధ్యతలు చేపట్టి కమ్యూనిస్టులను విస్మరిస్తే ఎన్నికల్లో, ఇతర కార్యక్రమాల్లో తగిన గుణపాఠం చెబుతామన్నారు. ఈ సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్, సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు చాడ శ్రీధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ, బీఆర్ఎస్‌ను ప్రజలు నమ్మేలా లేరు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యనారాయణ, ఎంపీ అభ్యర్థి రాజేందర్‌రావు

గన్నేరువరం: కాంగ్రెస్ పార్టీతోనే దేశం అభివృద్ధి చెందుతుందని, రాష్ట్రంలో అధికారం చేపట్టాక వంద రోజుల్లోనే ఐదు గ్యారంటీలు అమలు చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, కరీంనగర్ ఎంపీ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు అన్నారు. మండలంలోని గుండ్లపల్లి వద్ద శుక్రవారం నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో మాట్లాడారు. బీజేపీ, బీఆర్ఎస్‌ను ప్రజలు నమ్మేలా లేరని, రెండు పార్టీలు ఒక్కటేనని, బండి సంజయ్‌కుమార్ ఐదేళ్లలో ఏం అభివృద్ధి చేశారో చెప్పాలని మండిపడ్డారు. మత రాజకీయాలతోనే పబ్బం గడుపుతున్నాడని ఆరోపించారు. నేను రామ భక్తుడినే రోజు ఇంటి వద్ద పూజలు చేస్తానని రాజేందర్‌రావు అన్నారు. ఆగస్టు 15 వరకూ రుణమాఫీ చేస్తామన్నారు. మహిళలకు రూ.2500 ఇచ్చే బాధ్యత కాంగ్రెస్ తీసుకుంటుందన్నారు. గుండ్లపల్లి నుంచి పొత్తూర్ వరకూ డబుల్ రోడ్డు నిర్మాణం పూర్తి చేయించే బాధ్యత మాదేనన్నారు. మీ లాగా ఇచ్చిన హామీలు గాలికొదిలేసి తిరిగేటోళ్లం కాదని అన్నారు. ఎంపీ ఎలక్షన్‌లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. పలు గ్రామాల మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో ఎంపీపీ లింగాల మల్లారెడ్డి, మండల అధ్యక్షులు ఉపేందర్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి శ్రీనాథ్‌రెడ్డి, నాయకులు మాతంగి అనిల్, కొమ్మెర రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

సెల్‌టవర్ ఎక్కి హల్‌చల్

మానకొండూర్‌రూరల్: భూ సమస్య పరిష్కరించాలని, భార్య కాపురానికి రావట్లేదని మండలంలోని వెల్ది గ్రామంలో శుక్రవారం ఓ వ్యక్తి సెల్‌టవర్ హల్‌చల్ చేశాడు. గ్రామస్తులు, కుటుంబ సభ్యుల వివరాలు..గ్రామానికి చెందిన వడ్లూరి శ్రావణ్(32)కు గ్రామశివారులో ఐదుగుంటల వ్యవసాయ భూమి ఉంది. పక్కన రామగిరి(ట్రాక్టర్) బాబు, నాంపల్లి, కుమార్, రాజయ్య, శంకర్(డీలర్)ల వ్యవసాయ భూములున్నాయి. ఆరేళ్లుగా తన భూమిలోకి వెళ్లడానికి ఐదుగురు దారి ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని, భూమి విక్రయించాలనుకుంటే అడ్డుకుంటున్నార ని, మూడు నెలల క్రితం భార్య గొడవల కారణంగా పుట్టింటికి వెళ్లి కాపురానికి రాక పోవడంతో మానసిక వేదనకు గురవుతున్నాడని తెలిపారు. శుక్రవారం ఉదయం గ్రామ సమీపంలోని సెల్‌టవర్ ఎక్కి భూసమస్య పరిష్కరించాలని, భార్యను కాపురానికి వచ్చేలా చేయాలని మధ్యాహ్నం రెండు గంటల వరకు పైనే ఉన్నాడు. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు ఎంత చెప్పిన కిందికి రాలేదు. సమస్య పరిష్కరించాలని రావాలని డిమాండ్ చేయగా సీఐ రాజ్‌కుమార్ ఫోన్‌లో హామీ ఇవ్వడంతో సెల్‌టవర్ దిగాడు. పోలీసులు శ్రావణ్‌ను ఇంటికి పంపించడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

హుజూరాబాద్: హుజూరాబాద్‌కు చెందిన ప్రముఖ వైద్యుడు ముక్క కృష్ణమూర్తి మనువడు, వైద్యులు ముక్క నవీన్-స్వాతిల కుమారుడు నివేశ్(20) ఇటీవల అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మృతుని కుటుంబ సభ్యులను శుక్రవారం కరీంనగర్ ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌కుమార్ పరామర్శించారు. మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. మృతికిగల కారణాలను, తెలుసుకున్నారు. మృతదేహం అమెరికా నుంచి రావడం గురించి అడిగారు. వెంట బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, నాయకులు పుప్పాల రఘు, సంపత్‌రావు, గంగిశెట్టి రాజు, తదితరులు ఉన్నారు.

ఆవును గాయపరిచాడని ఫిర్యాదు

శంకరపట్నం: మండలంలోని అర్కండ్ల గ్రామంలో ధాన్యపు రాసిని ఆవు మేసిందని ఇజ్జిగిరి సంపత్ అనే వ్యక్తి పారతో ఆవును గాయపర్చాడని యమునూరి ఎల్లయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అతనిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నాడు.